క్లుప్తంగా

హెల్త్ కార్డులు ఇవ్వాలి

సూర్యాపేటటౌన్ : ప్రైవేట్ ఉపాధ్యాయులకు ప్రభుత్వం వెంటనే హెల్త్ కార్డులు ఇవ్వాలని తెలంగాణ ప్రైవేట్ ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుమార్ కోరారు. శనివారం జిల్లా కేంద్రంలోని యూటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన ప్రైవేట్ ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ రవి కుమార్, టీపీయూఎస్ జిల్లా అధ్యక్షుడు పిల్లలమర్రి కళింగం, జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మకంటి ఉపేందర్, జానయ్య, మహేష్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

నూతనకల్ : పెన్షనర్ల సంఘం మండల కమిటీని శనివారం మండల కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బాషనపల్లి మల్లయ్య, కార్యదర్శిగా ఆలగడప సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా లక్ష్మయ్య, కోశాధికారిగా ఎండీ ఇమామ్‌తో పాటు మరి కొంత మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, లక్ష్మయ్య, రంగారావు, జగన్‌మోహన్‌రావు, యాదయ్య, ఏలేటి నారాయణరెడ్డి పాల్గొన్నారు.

భూసమస్యల శాశ్వత పరిష్కారానికి కృషి

నూతనకల్ : మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో భూసమస్యల శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తహసీల్దార్ ఎం. శ్రీనివాస రావు తెలిపారు. శనివారం గుండ్లసింగారంలో గ్రామసభ ఏర్పాటు చేసి ప్రజలతో మాట్లాడారు. షెడ్యూల్ ప్రకారం వివిధ గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి భూములను పట్టా చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

హామీ అమలు చేయాలి

అర్వపల్లి : ముదిరాజ్‌లను బీసీ–డీ నుంచి బీసీ–ఏ లోకి మార్చే కామారెడ్డి డిక్లరేషన్ హామీని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(మెపా) రాష్ట్ర కార్యదర్శి దాసరి వీరన్నముదిరాజ్ కోరారు. శనివారం విలేకరులతో మాట్లాడారు. ముదిరాజ్‌ల రిజర్వేషన్‌కు సంబంధించి జీఓ 15 కోసం మెపా వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ఆధ్వర్యంలో ప్రభుత్వానికి అనేకసార్లు వినతిపత్రాలు అందజేసినట్లు తెలిపారు. అలాగే ర్యాలీలు కూడా నిర్వహించినట్లు తెలిపారు. ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీని స్థానిక సంస్థల ఎన్నికలలోపు అమలు చేయాలని, లేనిచో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మెపా మండల అధ్యక్షుడు సాయిని మనోహర్‌ముదిరాజ్, నాయకులు దాసరి రమేష్, వీరయ్య, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

హిందీ టీఎల్ఎం మేళా



బోధనోపకరణాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

పెన్‌పహాడ్ : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎంఈఓ నకిరేకంటి రవి శనివారం హిందీ టీఎల్ఎం మేళాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు హిందీ భాషపై పట్టు సాధించాలని ఆయన కోరారు. విద్యార్థులు గుణింతాలు, బోధనోపకరణాలను ప్రదర్శించారు. విద్యార్థులకు హిందీలో ఉపన్యాస పోటీలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. హిందీ జిల్లా రిసోర్స్ పర్సన్ ఆనంద్‌భాస్కర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఏడీఏపై చర్యలు తీసుకోవాలి

అర్వపల్లి : యూరియా సరఫరాలో అనేక కొర్రీలు పెట్టడంతో పాటు అక్రమంగా లైసెన్సులు జారీ చేసి అవకతవకలకు పాల్పడుతున్న తుంగతుర్తి ఏడీఏ రమేష్‌బాబుపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్‌రెడ్డితో పాటు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినట్లు జాజిరెడ్డిగూడెం పీఏసీఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్‌రెడ్డి తెలిపారు. శనివారం రాత్రి విలేకరులతో మాట్లాడారు. జాజిరెడ్డిగూడెం పీఏసీఎస్ నందు దౌర్జన్యంగా లైసెన్స్ తీసుకెళ్లాడని ఆరోపించారు. ఏడీఏ రమేష్‌బాబుపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

అంగన్‌వాడీల్లో పౌష్టికాహారం

అర్వపల్లి: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలు, గర్భిణులు, బాలింతలకు బలవర్ధక ఆహారం అందిస్తున్నట్లు తుంగతుర్తి ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ శ్రీజ తెలిపారు. పోషణమాసం కార్యక్రమంలో భాగంగా రామన్నగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పిల్లల తల్లులతో సమావేశం నిర్వహించారు. పోషణమాసం ప్రత్యేకతను వివరించారు. ఆకుకూరలు ఎక్కువగా తీసుకుంటే రక్తహీనత బారిన పడకుండా ఉంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ అనిరెడ్డి పుష్పలత, పిల్లల తల్లులు, గర్భిణులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీడీపీఓ శ్రీజ

ముందస్తుగా బతుకమ్మ వేడుకలు

సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాల్లోని పాఠశాలల్లో శనివారం ముందస్తుగా బతుకమ్మ సంబరాలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా రంగు, రంగు పూలతో బతుకమ్మలను పేర్చారు. పాఠశాలల ఆవరణలో బతుకమ్మ ఆడారు. ఈ కార్యక్రమంలో అయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



నూతనకల్ : నాగార్జున ఉన్నత పాఠశాలలో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు



అర్వపల్లి : జెడ్పీహెచ్ఎస్‌లో బతుకమ్మలతో ఉపాధ్యాయులు, విద్యార్థులు



అర్వపల్లి : కాసర్లపహాడ్ ప్రాథమిక పాఠశాలలో..



పెన్‌పహాడ్ : సింగారెడ్డిపాలెం పాఠశాలలో..



ఆత్మకూర్(ఎస్) : కాగితం పూలతో తయారు చేసిన బతుకమ్మతో మోడల్ స్కూల్ విద్యార్థిని



అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం ప్రాథమిక పాఠశాలలో..



ఆత్మకూర్(ఎస్) : నెమ్మికల్ స్కూల్‌లో..



అర్వపల్లి కేజీబీవీలో..



ఆత్మకూర్(ఎస్) : మోడల్ స్కూల్‌లో..



నాగారం : పసునూర్ మోడల్‌స్కూల్‌లో..



తిరుమలగిరి : కృష్ణవేణి పాఠశాలలో..



ఆత్మకూర్(ఎస్) : ప్రాథమిక పాఠశాలలో..



తుంగతుర్తి: కొత్తగూడెం ప్రాథమిక పాఠశాలలో..



నాగారం : పాటిమీదిగూడెం పాఠశాలలో..



అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం జెడ్పీహెచ్ఎస్‌లో..



నాగారం : విజయనగర్ కాలనీ పాఠశాలలో..



నాగారం : పసునూర్ ప్రాథమిక పాఠశాలలో..

బతుకమ్మ పండుగకు ఏర్పాట్లు



సద్దుల చెరువు వద్ద లైట్లు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది



బారికేడ్లు కడుతున్న సిబ్బంది

సూర్యాపేట అర్బన్ : సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలో బతుకమ్మ వేడుకలకు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ హనుమంత రెడ్డి తెలిపారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా చెరువు కట్టపై, రైతు బజారు చౌరస్తా, శంకర్ విలాస్ నుంచి కల్నల్ సంతోష్ బాబు విగ్రహం వరకు, అలాగే వివిధ వార్డులలోని బతుకమ్మ ఆడే ప్రాంతాలలో లైటింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సద్దుల చెరువు వద్ద బారికేడ్లు కడుతున్నట్లు తెలిపారు. బతుకమ్మలను చెరవులోకి వదిలే వద్ద మున్సిపల్ సిబ్బందిని ఉంచుతామని అన్నారు. బతుకమ్మల నిమజ్జనానికి మహిళలు ఎవరు కూడా చెరువులోకి దిగొద్దని, అక్కడ ఉన్న సిబ్బందికి అందజేయాలని సూచించారు.

23న భవన నిర్మాణ కార్మికుల ధర్నా

సూర్యాపేట అర్బన్ : జిల్లాలో భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 23న సూర్యాపేట జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి యల్క సోమయ్య గౌడ్ కార్మికులకు పిలుపునిచ్చారు. నివారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అనంతుల మల్లయ్య అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కార్మికశాఖ అధికారులు కార్మికుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. సమస్యలు పరిష్కారం కాకపోతే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా కోశాధికారి కొత్తపల్లి శివకృష్ణ, జిల్లా నాయకులు లకావత్ బాలాజీ నాయక్, మల్లెపాక నాగేష్, కందుల నాగలక్ష్మి, కొమర రాజు, ములకలపల్లి పద్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యల్క సోమయ్యగౌడ్

ఘనంగా మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం



రుద్రాభిషేకం చేస్తున్న వేదపండితులు

చివ్వెంల : బాద్రపద మాస శివరాత్రి సందర్భంగా మండల పరిధిలోని ఉండ్రుగొండ శ్రీలక్ష్మీ నర్సింహ స్వామి ఆలయ ప్రాంగణంలోని ఉమామహేశ్వర స్వామి వారికి శనివారం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం వైభవంగా నిర్వహిచారు. ఈ సందర్భంగా వేదపండితులు బ్రహ్మశ్రీ మనోహర శర్మ, శివరామ క్రిష్ణ శర్మలు మంత్రోచ్ఛరణతో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చకిలం క్రిష్ణకుమార్, బందకవి క్రిష్ణ మోహన్, డాక్టర్ రామయ్య పాల్గొన్నారు.

ఆరోగ్యకరమైన జీవన శైలిని అలవర్చుకోవాలి

నాగారం : మహిళలు ఆరోగ్యకరమైన జీవన శైలిని అలవర్చుకోవాలని మండల వైద్యాధికారి యనగందుల నాగరాజు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మహిళలకు వైద్య సేవలు అందించడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. అనంతరం స్పెషలిస్ట్ డాక్టర్ యశ్వంత్, డాక్టర్ పూనం మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి మాలోతు బిచ్చునాయక్, హెల్త్ ఎడ్యుకేటర్ విమలమ్మ, పీహెచ్ఎన్ఓ అరుణ కుమారి, సూపర్ వైజర్ వినోద, సిబ్బంది సుజాత, యాదగిరి, నాగరాజు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న వైద్యాధికారులు

అక్రమ అరెస్టులు తగవు

పెన్‌పహాడ్: ప్రతిపక్ష నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం హేయమైన చర్య అని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దొంగరి యుగేందర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టారని దోసపహాడ్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దొంగరి యుగేందర్, గ్రామ అధ్యక్షులు ఎల్లంల జగన్, పర్వతం నాగయ్యను పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారని తెలిపారు. ఈ విషయమై ఎస్ఐ గోపికృష్ణను వివరణ కోరగా.. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా విచారణ కోసమే స్టేషన్‌కు తీసుకువచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో బొల్లక బొబ్బయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

తుంగతుర్తి : విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని తహసీల్దార్ దయానందం అన్నారు. శనివారం అన్నారం జెడ్పీహెచ్ఎస్‌లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మాట్లాడారు. తాజా కూరగాయలు తీసుకురావాలని వర్కర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పటిష్టంగా పని చేయాలి

సూర్యాపేట : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు కోసం ప్రతి కార్యకర్త పటిష్టంగా పనిచేయాలని మాజీ జెడ్పీటీసీ జీడి భిక్షం అన్నారు. శనివారం రామారం ఎంపీటీసీ పరిధిలోని రత్నపురంలో బూత్ లెవల్ సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలన్నారు. బీఆర్ఎస్ హయాంలో చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వినోద్, వల్దాస్ ఉపేందర్, భూపతి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక

నాగారం : డి.కొత్తపల్లికి చెందిన పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు శనివారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కల్లెట్లపల్లి ఉప్పలయ్య ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారిలో గైగుళ్ల లింగస్వామితోపాటు పలువురు ఉన్నారు. ఈ కార్యక్రమంలో యారాల నర్సింహారెడ్డి, జి.సైదులు, జి.వీరయ్య, యాదగిరి, సతీష్, రాజశేఖర్ పాల్గొన్నారు.

నేడు మహాలయ అమావాస్య అన్నప్రసాదం



మాట్లాడుతున్న గుండా వెంకన్న

సూర్యాపేట : పట్టణంలోని శంకర్‌విలాస్ సెంటర్‌లో ఆదివారం మహాలయ అమావాస్య సందర్భంగా అన్నప్రసాదం అందజేయనున్నట్లు సుమన్ యువసేన జిల్లా అధ్యక్షులు గుండా వెంకన్న తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత మూడు సంవత్సరాలుగా మహాలయ అమావాస్య రోజున అన్న ప్రసాద కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహాలయ పక్షంలో పితృదేవత పూజ ఎంతో విశిష్టమైనదని తెలిపారు. వేద పండితుల మంత్రోచ్ఛరణలతో అన్న ప్రసాద కార్యక్రమం జరుగుతుందని, కార్యక్రమంలో పాల్గొని పితృ దేవతలకు శాంతి కలిగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుమన్ యువసేన సభ్యులు గోపారపు రాజు, బొల్లం సురేష్, గుడిపాటి రమేష్, మొరిశెట్టి రాము, బీకే రాజు, చందా రాజశేఖర్, బచ్చు పురుషోత్తం, బ్లూసీ జానీ, కొండ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడి

నాగారం : రైతులు నాణ్యమైన విత్తనాలు ఎంచుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ పరిశోధన సంస్థ కంపసాగర్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఎ.స్వాతి, నలిని అన్నారు. శనివారం నాగారం, వర్ధమానుకోట, ఈటూరు గ్రామాలలో క్షేత్ర సందర్శనలో భాగంగా వరి, పెసర పంటలను పరిశీలించారు. పంటలో ఎదుగుదల, పిలకల శాతం, పురుగులు, తెగుళ్ల వంటి లక్షణాలను పరిశీలించారు. రైతులకు తగు సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి కృష్ణకాంత్, ఏఈఓలు ఎస్.సాయిరాజ్, బి. సంధ్య, జి.శ్రీను, రైతులు బద్దం వెంకటరెడ్డి, ఆకారపు శ్రీను, మోదుగు నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

ఇచ్చిన హామీ మేరకు పెన్షన్లు పెంచాలి



నిరసన తెలుపుతున్న వికలాంగులు

ఆత్మకూర్ (ఎస్) : కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు వికలాంగులతో పాటు అన్నిరకాల పెన్షన్లను పెంచాలని ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు యాతాకుల రాజన్నమాదిగ అన్నారు. శనివారం వికలాంగుల హక్కుల పోరాట సమితి, చేయుత పెన్షన్‌దారుల హక్కుల పోరాట సమితి, ఎమ్మార్పీఎస్‌ల ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20 నెలలు గడుస్తున్నా పింఛన్ల పెంపును పట్టించుకోకపోవడం దారుణమన్నారు. పింఛన్లు పెంచకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని తెలిపారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి సుధాకర్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మేడి కృష్ణ మాదిగ, వీహెచ్‌పీఎస్ జిల్లా నాయకుడు కొప్పుల కళింగ రెడ్డి, నగిరే కృష్ణ, బొడ్డు నవీన్, ముల్కలపెల్లి వీరమ్మ, యాతాకుల ముత్యాలు, మధు, సాయి, కాంతమ్మ ఎల్లమ్మ, రాములు, పాపయ్య, వజ్రం పాల్గొన్నారు.

సేవలో ముందంజ



సామగ్రి అందజేస్తున్న కంపెనీ ప్రతినిధులు

అర్వపల్లి : సేవా కార్యక్రమాల్లో సుధాకర్ పీవీసీ ముందంజలో ఉంటుందని ఆ కంపెనీ మేనేజర్ అచ్యుతశర్మ అన్నారు. సూర్యాపేటకు చెందిన సుధాకర్ పీవీసీ ఆధ్వర్యంలో తిమ్మాపురం జెడ్పీహెచ్ఎస్‌కు ఆ కంపెనీ అధినేత మీలా మహదేవ్ అందించిన సుమారు రూ.50వేల విలువ చేసే 12 డెస్క్ బెంచీలు, 6 టేబుళ్లను శనివారం బహూకరించారు. కార్యక్రమంలో హెచ్ఎం కుంభం ప్రభాకర్, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, రిటైర్డు టీచర్ గుండా రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

చివ్వెంల : గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని సూర్యాపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని అక్కలదేవిగూడెం గ్రామం నుంచి పాశ్యానాయక్ తండా వరకు వేస్తున్న మిషన్ భగీరథ పైపు లైన్‌కు శంకుస్థాపన చేసి మాట్లాడారు. ప్రజలు తాగునీటి కోసం మిషన్ భగీరథ నీటిని వినియోగించుకోవాలని సూచించారు. అధికారులు తాగునీటి సమస్యపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ధరావతు వీరన్న నాయక్, మాజీ జెడ్పీటీసీ చింతమళ్ల రమేష్, మాజీ సర్పంచ్ ధరావతు పద్మమంగ్యా తదితరులు పాల్గొన్నారు.



పనులను ప్రారంభిస్తున్న వేణారెడ్డి

వాటర్ బాటిళ్ల పంపిణీ

అర్వపల్లి : అర్వపల్లిలోని పీఏసీఎస్ ఎదుట శనివారం మండుటెండలో అన్నదాతలు యూరియా కోసం ఇబ్బందులు పడుతుండటంతో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సుమారు 800 వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గుండగాని సోమేష్ గౌడ్, మొరిశెట్టి ఉపేందర్, బొడ్డు రామలింగయ్య, నాయకులు యుగంధర్, సోమిరెడ్డి పాల్గొన్నారు.

● కిక్కిరిసిన ‘పేట’ బస్టాండ్





స్కూళ్లకు సెలవులు రావడంతో శనివారం విద్యార్థులు ఇళ్లకు పయనమయ్యారు. పేట బస్టాండ్ రద్దీగా మారింది. – సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సూర్యాపేట